PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.


నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 120 | 14 శుక్రవారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

**ఇది ఆరంభం మాత్రమే**



## సీడ్ యాక్సెస్ రోడ్డు..

# మరో కీలక ఘట్టం

### నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

21.77 కిలోమీటర్ల పొడవైన సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన చంద్రబాబుబకింగ్‌హామ్ కెనాల్‌పై 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన సీఎంఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రాజధాని కనెక్టివిటీని బలోపేతం చేసే లక్ష్యంతో మొత్తం రూ.1,519 కోట్ల భారీ వ్యయంతో 21.77 కిలోమీటర్ల పొడవున, 60 మీటర్ల వెడల్పుతో 9 లేన్ల రహదారిగా దీనిని రూపొందిస్తున్నారు. విజయవాడ-మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై 478 మీటర్ల పొడవునా నూతనంగా నిర్మించిన 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని కూడా సీఎం ప్రారంభించారు. ఇది రాజధాని ప్రాంతానికి రాకపోకలను మరింత సులభతరం చేయనుంది.సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమీపంలో అధికారులు, ఉద్యోగుల కోసం నిర్మించిన 9 టవర్లలోని 216 క్వార్టర్ల పనులన్నీ (ఇంటీరియర్స్ సహా) పూర్తయ్యాయి. అధికారులు వీటికి సంబంధించిన తాళాలను సీఎం చంద్రబాబు నాయుడికి అందజేయనున్నారు.

## అవయవదానంపై చైతన్యం పెంచాలి:

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అవయవదాన దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు
అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని సూచన
ఒకరి ప్రాణం నిలపడం ద్వారా మన జీవితానికి కొత్త అర్థం వస్తుందన్న పవన్
ప్రాణదానం చేసి, జీవితాలను కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి

ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. అవయవాలను దానం చేయాలనే ఒక చిన్న నిర్ణయం మరొకరికి పునర్జన్మను ప్రసాదిస్తుందని, ఇది అత్యంత శక్తివంతమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.



## ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

- పేదింటి పిల్లలకు శాపంగా మారిన కాంగ్రెస్ తీరు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



## పిల్లల ఆరోగ్యంపై

# ఆటలొద్దు...



**ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే**
**మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం**
**కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్13 (ప్రజా సీమ):

: అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. ...మిగతా 2 లో...

## దేశవ్యాప్తంగా బొగ్గుకు

# ఒకే ధర.

- త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్టు13 (ప్రజా సీమ)::



దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలి ఓ పారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఏపీలో మోగనున్న స్థానిక నగారా.. ఓటర్ల జాబితాల ప్రచురణకు ఆదేశాలు



### ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు

ఓటర్ల జాబితాల ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్
సెప్టెంబర్ 3న పురపాలికల్లో, ఆగస్టు 17న కొన్ని పంచాయతీల్లో జాబితాల ప్రకటనఆగస్టు 31లోగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఖరారుకు ఆదేశాలు
సెప్టెంబర్, అక్టోబర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అంచనా
ఏపీ లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓటర్ల జాబితాల ప్రచురణకు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్టయింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను ప్రచురించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, గతంలో జాబితాలు ప్రచురించని 20 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 17న ఓటర్ల జాబితాలను ప్రకటించాలని స్పష్టం చేశారు.



## జగన్ పర్యటనలో అడుగడునా ఉల్లంఘనలు

### తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనదారులు

కర్నూలు,ఆగస్ట్13 (ప్రజా సీమ):



వైకాపా అధినేత జగన్ కర్నూలు పర్యటనలో అడగడుగునా పోలీసు ఆంక్షలను ఉల్లంఘించారు. అనుమతి లేకపోయినా బళ్లారి చౌరస్తాలో జాతీయ రహదారిపై డీజే పెట్టుకుని బైక్‌లతో స్టంట్స్ చేస్తూ జనానికి చుక్కలు చూపించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్నూలు జిల్లా కారాగారంలో ఉన్న ఆలూరు వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శిం చేందుకు జగన్ ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. అనుమతులు లేకపోయినా అక్కడి నుంచి భారీ ర్యాలీతో కర్నూలు బయల్దేరారు. దీంతో పలు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు హెచ్చరించినా.. వైకాపా నాయకులు ఖాతరు చేయకుండా భారీ జనసమీకరణ చేసినట్టు సమాచారం. జగన్ కాన్వాయ్ తొందరగా వెళ్లాలని రూరల్ సీఐ చంద్రబాబు కోరగా.. వైకాపా కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. ఆయన వాహనానికి అడ్డుగా నిలిచి ఆందోళన చేపట్టారు.

## లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు

# పాక్ అండ...

- పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు
- అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన

న్యూఢిల్లీ,ఆగస్ట్13 (ప్రజా సీమ):

పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ...మిగతా 2 లో...

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

మొదటిపేజీ తరువాయి

నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# బిసి మహిళలకు స్వయం ఉపాధి

మొదటిపేజీ తరువాయి

వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం...

మొదటిపేజీ తరువాయి

కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు...

మొదటిపేజీ తరువాయి

'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,ఆగస్ట్13 (ప్రజా సీమ):

రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సంక్షేమ పథకాల పట్ల అనుసరిస్తున్న దగాకోరు విధానాల వల్లే పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలిచే 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై హైకోర్టు స్టే విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను రుజువు చేసిందని మండిపడ్డారు. పేద వర్గాలకు ఈ పథకాల ఫలాలు అందకూడదనే దుర్బుద్ధితో, నిధులను ఎగ్గొట్టే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కోర్టు వ్యవహారాల్లో అలసత్వం వహించిందని విమర్శించారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేస్తామని గతంలో అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేసినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని రంగుల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత తులం బంగారం ఇవ్వకపోగా పథకాన్ని కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాదరణ పొందిన పథకాలను పూర్తిగా రూపుమాపే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నాటకాలకు తెరలేపుతోందని దుయ్యబట్టారు. 2014 నుంచి బీఆర్ఎస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు రూ. 13 వేల కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచామని పేర్కొన్నారు. ?ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తును వీడి, వచ్చే విచారణ గడువైన సెప్టెంబరు 9 లోగా ఉన్నత న్యాయస్థానంలో బలమైన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టసభల ద్వారా ప్రత్యేక చట్టబద్ధత కల్పించి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు వెంటనే నిధులు విడుదలయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనూ, చట్టసభల్లోనూ పోరాడుతుందని హెచ్చరించారు.

# ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

**అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి**

**సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పీ.డీ.వో.లు నిలబెట్టుకోవాలి**

**రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి**

హైదరాబాద్,ఆగస్ట్13 (ప్రజా సీమ):

ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75శాతం సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండలస్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తీసుకోవాల్సిన అనేక అంశాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. కార్యక్రమంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు...

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

# అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

## కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి

న్యూఢిల్లీ,ఆగస్టు13 (ప్రజా సీమ)::

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

# లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాక్ అండ...

మొదటిపేజీ తరువాయి

ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

ప్రజాసీమ

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు !

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవమానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్దితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్దంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బంలగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

# చేయూత పింఛన్ ల దరఖాస్తులు స్వీకరించండి.






### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

(ప్రజా సీమ):

చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం కింద అర్హులైన కొత్త లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి గురువారం చేయూత సామాజిక భద్రత పింఛన్లు కొరకు దరఖాస్తులు స్వీకరణ, జలసిరి, ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహణ, వనమహోత్సవం తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్, మున్సిపల్, వైద్య, ఎక్సైజ్ తదితర అంశాలపై ఐడిఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయూత పింఛన్ల కొత్త మంజూరుకు సంబంధించి సెర్ప్ సర్క్యులర్ ప్రకారం అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు .వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా మరియు డయాలసిస్ బాధితులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్, గ్రీవెన్స్ కార్యక్రమాల్లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకున్నట్లైతే అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో దరఖాస్తు చేయని వారు, అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా కొత్తగా అర్హత సాధించిన వారు మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆగస్టు 31, 2026లోగా స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి/ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారి/మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దరఖాస్తుదారులు ఆధార్, వయస్సు ధృవీకరణ, రేషన్ కార్డు లేదా అవసరమైన ఆదాయ ధృవీకరణ, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు సంబంధిత పింఛన్ వర్గానికి అవసరమైన ప్రత్యేక ధృవీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. పింఛను కొరకు దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని తెలిపారు. అన్ని ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయంలో చేయూత హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి

పింఛన్లు కొరకు దరఖాస్తు చేయు వ్యక్తులకు సహాయతను అందించాలని తెలిపారు. జలసిరిలో చేపట్టిన ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓలు, ఏపీఎంలను కలెక్టర్ ఆదేశించారు. విఓలకు కేటాయించిన లక్ష్యం మేర ఫామ్ పాండ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

అలాగే వ్యక్తిగత ఇంకుడు గుంతలు, పెర్కొలేషన్ ట్యాంకులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, బోర్‌వెల్ రీఛార్జ్ వంటి జలసిరి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమా న్ని మండల స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి మండలంలో ప్రజావాణి నిర్వహణకు ఎంపీడీఓను నోడల్ అధికారిగా వ్యవహరించాలని సూచించారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే నమోదు చేసేందుకు హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, డేటా ఎంట్రీ సదుపాయం ఏర్పాటు చేయాలని, అర్జీలు రాయడంలో ప్రజలకు సహాయం అందించాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు, తగినన్ని కుర్చీలు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఎక్సైజ్ ఈఎస్ కిరణ్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటరత్నం మండల కేంద్రాల నుంచి తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల కడుపు కొడితే ఊరుకునేది లేదు...





### - హుజూరాబాద్‌లో మిన్నంటిన నిరసనలు..

### -కాంగ్రెస్ నాయకుడు స్వామిరెడ్డి ని వెంటనే సస్పెండ్ చేయాలంటూ జర్నలిస్టులు, ప్రజాసంఘాల భారీ ఆందోళన...

(ప్రజా సీమ):

జర్నలిస్టుల హక్కులపైనా, వారి నివేశన స్థలాలపైనా కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి తీరును నిరసిస్తూ హుజూరాబాద్‌లో ఆగ్రహజ్వాలలు మిన్నంటాయి. జర్నలిస్టులకు గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలపై న్యాయస్థానంలో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, సొంత పార్టీ మంత్రులను సైతం దుర్భాషలాడుతున్న స్వామిరెడ్డిని కాంగ్రెస్ నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ ప్రెస్ క్లబ్, ప్రజాసంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ పురవీధుల గుండా సాగిన భారీ ర్యాలీతో హుజూరాబాద్ వీధులు హోరెత్తాయి. జర్నలిస్టులతో పాటు ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

#### 50 మంది విలేకరుల పొట్ట కొట్టే కుట్ర...

ఈ సందర్భంగా హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామని రవీందర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి సంబంధం లేకపోయినా కేవలం కక్ష సాధింపు ధోరణితోనే కోర్టును ఆశ్రయించి 50 మంది పేద విలేకరుల కడుపు కొట్టేందుకు స్వామిరెడ్డి దారుణమైన కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గత 20 ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ అరకొర ఆదాయంతో దయనీయ జీవితాలు గడుపుతున్న పాత్రికేయుల స్థలాలను లాక్కోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికార పార్టీలో ఉంటూనే మంత్రులకు, క్షేత్రస్థాయి నాయకులకు మచ్చ తెచ్చేలా ప్రవర్తిస్తున్న ఆయనపై పార్టీ అధిష్ఠానం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

#### బోగస్ బిల్లులు.. ప్రభుత్వ భూమి కబ్జా...

స్వామిరెడ్డిపై తీవ్రస్థాయిలో అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏ పని చేయకుండానే ఎం బి రికార్డులు సృష్టించి లక్షలాది రూపాయల ప్రభుత్వ బిల్లులు పొందుతున్నాడని నిరసనకారులు బహిరంగంగా ఆరోపించారు. అంతేకాకుండా, హుజూరాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 125లో గల దాదాపు 300 గజాల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా తన వ్యక్తిగత కార్యాలయాన్ని నిర్మించుకున్నారని ధ్వజమెత్తారు. పనులు చేయకుండానే ఎంబి రికార్డులు సృష్టిస్తూ, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించే ఇటువంటి వ్యక్తులు జర్నలిస్టుల స్థలాలపై కేసులు వేయడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు."జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వ్యవహారంలో నిర్లక్ష్యం తగదు. రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు తక్షణమే జోక్యం చేసుకుని ఈ కోర్టు కేసుల చిక్కుముడిని విప్పాలి. విలేకరులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు." అని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

#### కళాకారుల ఆటపాటలు.. దద్దరిల్లిన నిరసన..

ర్యాలీ అనంతరం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవంపై కళాకారులు ఆలపించిన ఉద్యమ గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి ఆటపాటలతో నిరసన ప్రాంగణం ఉద్యమ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, సందెల వెంకన్న, ప్రియదర్శిని, మాడుగుల ఓదెలు, సీనియర్ జర్నలిస్ట్ అంబాల ప్రభాకర్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు, బాధితులు భారీ సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. స్వామిరెడ్డి వైఖరి మారకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు.

# ఈనెల 17వ తేదీన జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి: ఏపీయూడబ్ల్యూజే

**రాజంపేట (ప్రజా సీమ):**

ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 17వ తేదీన రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని చారవాణి ద్వారా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి రాజంపేట తాలూకా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా కమిటీ సభ్యులు ఐకమత్యంతో కలిసి మెలిసి యూనియన్ బలోపేతానికి పనిచేయాలన్నారు. కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు కమిటీ సభ్యులకు ముందుగా సమాచారాన్ని అందించాలని తెలియజేశారు. కమిటీ సభ్యులు సమిష్టిగా పనిచేసే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో సీఈఓ వివేక్ యాదవ్ సమీక్ష

**కాకినాడ జిల్లా, (ప్రజా సీమ )**

రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఎస్-ఎస్ఆర్ (స్పెషల్ సమ్మరీ రివిజన్), ఫారం--6, 7, 8 తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ ఐఏఎస్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అమరావతిలోని 5వ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై జిల్లా వారీగా సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఫారం--6, 7, 8 దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.
కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, డీఆర్ఓ డా. తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీఓ మల్లి బాబు, పెద్దాపురం ఆర్డీఓ కృష్ణమూర్తి, ఎన్నికల సెల్ పర్యవేక్షకులు జగన్నాథం తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.




# పూజలకు అడ్డువస్తున్నాడని కిడ్నాప్.. యువకుడి హత్యకు యత్నం

**కారులో తీసుకెళ్లి కత్తితో గొంతు కోసేందుకు ప్రయత్నం**
**ముగ్గురు నిందితుల అరెస్ట్**
**కడప డీఎస్పీ బాలస్వామిరెడ్డి**

**కడప, ఆగస్టు 13(ప్రజా సీమ):**

పూజల వ్యవహారానికి అడ్డుగా వస్తున్నాడని భావించి యువకుడిని కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు ప్రయత్నించిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి కత్తి ఒక కారును కమలాపురం సీఐ మోహన్ ఆధ్వర్యంలో వల్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కడప ఇన్చార్జి డిఎస్పి బాలస్వామి రెడ్డి తెలిపారు. కడప డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ అరెస్ట్ అయిన చిత్తూరు జిల్లాకు చెందిన కాణిపాకం విజయ్‌కుమార్ అలియాస్ విజయ్ (54), కర్ణం బాల హేమనాథ్ అలియాస్ హేమంత్ (49), కర్ణం హేమనాథ్ బాల సుబ్రహ్మణ్యం (23) నిందితులు అనంతపురం జిల్లా శెట్టూరు ప్రాంతానికి చెందిన ఓ బాలిక తండ్రితో పరిచయం పెంచుకుని, డబ్బు ఆశ చూపి పూజల పేరుతో బాలికను తమ వెంట తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. పూజలో బాలికను కూర్చోబెడితే డబ్బులు వస్తాయని నమ్మించి, ఆమెను తమ ఇంట్లో పూజల పేరుతో ఉంచినట్లు పేర్కొన్నారు. అనంతరం కడపకు చెందిన ఓ వ్యక్తిని సంప్రదించి పూజల విషయమై మాట్లాడేందుకు బాలికను కడపకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా, ఆ వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో వల్లూరు ప్రాంతంలోని ఓ మహిళ ఇంటికి తీసుకువచ్చి అక్కడ ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

**పూజల వ్యవహారంపై ఆరా తీయడంతో దాడి:**

బాలికను తీసుకువచ్చిన విషయం, అక్కడ జరుగుతున్న వ్యవహారంపై ఆ ఇంటికి చెందిన గాదె నాగసాయి ప్రణవ్ ఆరా తీయడంతో నిందితులు అతనిపై కక్ష పెట్టుకొని ప్రణవ్ కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. తమ వ్యవహారానికి ప్రణవ్ అడ్డుగా ఉన్నాడని భావించి అతడిని హత్య చేయాలని ముగ్గురూ నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆగస్టు 10న రాత్రి సమయంలో ప్రణవ్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని కడప--కమలాపురం రహదారి మీదుగా కడప విమానాశ్రయం సమీపంలోని కంపచెట్ల ప్రాంతానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ ప్రణవ్‌పై కాళ్లు, చేతులతో దాడి చేసి గాయపరిచి, కత్తితో గొంతు కోసేందుకు ప్రయత్నించగా అతను గట్టిగా కేకలు వేశాడు. అరుపులు విని చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో నిందితులు కారులో అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. బాలికను విచారించిన అనంతరం పూజల పేరుతో జరిగిన వ్యవహారంపై వల్లూరు పోలీసులు జీరో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. హత్యాయత్నం కేసులో నిందితుల నుంచి మారుతి సుజుకి సియాజ్ కారు, ఒక కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డి.ఎస్.పి ఈ. బాలస్వామిరెడ్డి పర్యవేక్షణలో వల్లూరు ఎస్ఐ ఆర్. శివనాగిరెడ్డి తన సిబ్బందితో కలిసి గణేష్‌పురం గ్రామం సమీపంలోని కడప--కమలాపురం ప్రధాన రహదారి వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన వల్లూరు ఎస్ఐ, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించినట్లు డిఎస్పి తెలిపారు.



# రెండేళ్ల నమ్మకం భవిష్యత్తుకు బంగారు బాట

**ఆత్మకూరు(ప్రజాసీమ)**

గురువారం ఆత్మకూరు నియోజకవర్గంలోని మరిపాడు మండలం ఎపిలి కుంట గ్రామంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి రాష్ట్ర కార్యదర్శి ఆత్మకూర్ అబ్జర్వర్ శనివారపు మోహన్ రెడ్డి డోర్ టు డోర్ కరపత్రాలను ప్రజలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి ప్రగతిని,అందిస్తున్న పలుసంక్షేమ కార్యక్రమాలను మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కూటమి పాలనపై వారికి ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేశారు.



# భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు 13 ఏళ్లు జైలు శిక్ష

**ప్రొద్దుటూరు క్రైమ్ ఆగస్టు 13 (ప్రజా సీమ):**

భార్యను అనుమానంతో హత్య చేసేందుకు ప్రయత్నించిన కేసులో నిందితుడికి 13 సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు రెండో అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి కె. సత్యకుమారి తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 9 నెలల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. ప్రొద్దుటూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని చాపాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన నేర సంఖ్య 54/2025, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 109(1) కింద ఈ కేసు నమోదైంది. కేసు వివరాల ప్రకారం.. నక్కలదిన్నె గ్రామానికి చెందిన ఎర్రబోయిన భాస్కర్ తన భార్య కళావతిని అనుమానంతో తరచూ వేధిస్తూ, కొడుతూ ఉండేవాడు. 2025 మార్చి 6న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కళావతి కూలి పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాగా, భాస్కర్ ఇంట్లో మాంసం కోసే కత్తి తీసుకుని ఆమెను చంపుతానంటూ దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కళావతి తలపై మూడు నరికిన గాయాలు, ఎడమ చేతి మణికట్టు, అరచేతి వద్ద, నుదుటిపై, ఎడమ తొడపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి చాపాడు ఉపవిభాగ పోలీసు అధికారి టి. భావన కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు.
ఈ కేసులో న్యాయస్థానం సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువైనట్లు నిర్ధారించి భాస్కర్‌కు 13 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా 9 నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొంది. ప్రభుత్వ అభియోగ న్యాయవాది మార్తాల సుధాకర్ రెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు విచారణ సమయంలో సాక్షులను సకాలంలో న్యాయస్థానానికి హాజరుపరిచిన ప్రస్తుత చాపాడు ఎస్ఐ కె. చిన్నపెద్దయ్య, కోర్టు మానిటరింగ్ ఏఎస్ఐ ఆర్. సాయి ప్రసాద్, చాపాడు సెషన్స్ కోర్టు కానిస్టేబుల్ పీసీ 832 ఎం. గోపాల్‌లను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.



# దేశభక్తి,సమైక్యతకు మదనపల్లె మైలురాయిగా నిలవాలి










**- దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత,విద్యార్థుల పాత్ర కీలకం**
**- స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం**
**- మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపు**

**మదనపల్లె (ప్రజా సీమ)**

: దేశభక్తి,జాతీయ సమైక్యతకు మదనపల్లె మైలురాయిగా నిలిచిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు.ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రెండోరోజు టిప్పు సుల్తాన్ గ్రౌండ్ నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు భారీ జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో వేలాది మంది పాఠశాల,కళాశాలల విద్యార్థులతోపాటు ప్రజాప్రతి నిధులు,పుర ప్రముఖులు,అధికారులు,ఉపాధ్యాయులు,స్వచ్ఛంద సంస్థలు,కుల,ప్రజా సంఘాల ప్రతినిధులు ,డ్వాక్రా సంఘాల మహిళలు,పట్టణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.3 వేల అడుగుల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సాంస్కృతిక కార్యక్రమాలు ,కేరళ డ్రమ్స్,గుర్రపు స్వారీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశ ఐక్యత,సమగ్రతను కాపాడేందుకు ప్రతిపౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.మదనపల్లెలో అన్నివర్గాల ప్రజలు ఒకే జెండా కింద ఐక్యంగా నిలిచి ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు.కుల,మత,ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని,ఇదే దేశ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు.దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే అన్నారు .యువతలో దేశభక్తి, సేవాభావం,సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్,బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి,విజయభారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు,శ్రీరామ సహదేవ నాయుడు,రామిశెట్టి ఆంజనేయులు,మోడెం సిద్ధప్ప,గంగారపు రామ్మూర్తి నాయుడు,రామిశెట్టి కృష్ణ (కమలామర్రి),రాటకొండ శ్రీనివాసులు నాయుడు,బోనాసి జాన్ బాబు,యర్రబెల్లి వెంకటరమణారెడ్డి,బీదం గురునాథ్ యాదవ్,జి.వి.నాయుడు,మండిపల్లి మధుసూదన్ రెడ్డి,డి.రమేష్ రెడ్డి,మోహన్ రెడ్డి,రెడ్డి రాయల్,కొత్తిండ్లు దొరస్వామినాయుడు, పూలనాగరాజు ,ఎం.వేమయ్య,శ్రీ చందు,దివాకర్,మెప్మా మధుసూద,ఆర్పీలు జాఫరున్ని షా, ఉషారాణి,లక్ష్మి, శ్రావణి,నవీన్ చౌదరి,కమల్ బాషా,ఫోర్డ్ లలితమ్మ,ధాత్రి స్వాతి చక్రపాణి,చైతన్య సంస్థ కవిత రాణి,ఖాదర్ కుట్టి,ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి,యుటీఎఫ్ నాయకులు పురం వెంకటరమణ,అప్పుస్మా నాయకులు రఘునాథరెడ్డి,రామకృష్ణారెడ్డి,ప్రజాప్రతినిధులు,అధికారులు,ఉపాధ్యాయులు,ప్రజాసంఘాల నాయకులు,కళాశాలలు,పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు,మహిళలు,పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాసీమ

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పిఠాపురం అడ్డా

**తెలంగాణ నుంచి ఏళ్లుగా అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు**

**తాజాగా 30 టన్నులకుపైగా పీడీఎస్ బియ్యం పట్టివేత**

**రైస్‌మిల్లుల తనిఖీలపై అధికారుల తీరుపై ప్రశ్నలు**

పిఠాపురం, (ప్రజా వార్త ):

పేదలకు ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పిఠాపురం నియోజకవర్గం అడ్డాగా మారుతోందన్న ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా పాల్వంచ నుంచి పిఠాపురానికి తరలిస్తున్న 30 టన్నుల 280 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు తాజాగా పట్టుకోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది.
గొర్స రహదారిలోని రెడ్డి రామకృష్ణ అండ్ బ్రదర్స్ రైస్‌మిల్లుకు బియ్యం చేరిన అనంతరం పోలీసులు తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఎంఎస్‌వో తనిఖీలో బియ్యం పీడీఎస్‌కు సంబంధించినదిగా నిర్ధారణ కావడంతో బియ్యంతో పాటు లారీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.ఏళ్లుగా సాగుతోందా అక్రమ రవాణా?తాజాగా పట్టుబడిన లారీ వ్యవహారంతోనే ఈ అంశం ముగిసిపోవడం లేదు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని పలు రైస్‌మిల్లులకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖలు ఇప్పటివరకు ఎంత మేరకు నిఘా పెట్టాయి? ఎన్ని తనిఖీలు నిర్వహించాయి? ఎన్ని కేసులు నమోదు చేశాయి? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.అధికారుల నిఘా ఎక్కడ?పౌరసరఫరాల శాఖ, రవాణా శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తే తెలంగాణ నుంచి వచ్చే బియ్యం లారీలపై నిఘా పెట్టడం సాధ్యమేనని స్థానికులు చెబుతున్నారు. రైస్‌మిల్లుల్లోని బియ్యం నిల్వలు, లారీల రాకపోకలు, కొనుగోలు--విక్రయ రికార్డులను క్రమం తప్పకుండా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.అయితే ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ రవాణా వెనుక ఎవరి పాత్ర ఉంది? బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది? ఎక్కడికి తరలిస్తున్నారు?



మిల్లుల్లో నిల్వ చేసిన అనంతరం దాన్ని ఎలా విక్రయిస్తున్నారు? వంటి అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది.పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సి ఉంది.ప్రతి లారీపై నిఘా పెట్టాల్సిందేపేదలకు అందాల్సిన బియ్యం అక్రమ మార్గాల్లో తరలుతున్నట్లు తేలితే దాని వెనుక ఉన్న మొత్తం వ్యవస్థను బయటకు తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. తాజాగా పట్టుబడిన భారీ బియ్యం నిల్వల నేపథ్యంలో తెలంగాణ నుంచి పిఠాపురం నియోజకవర్గానికి వచ్చే బియ్యం లారీలపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు, స్థానిక రైస్‌మిల్లుల నిల్వలు, కొనుగోలు--విక్రయ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతోందా? దాని వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# చంద్రకాలనీ మున్సిపల్ యుపి పాఠశాల విద్యార్థుల అద్భుత ప్రతిభ

**- ఎన్ఎంఎంఎస్ (స్కాలర్షిప్స్) ఉపకార వేతనాలకు ముగ్గురు ఎంపిక**

మదనపల్లె (ప్రజా సీమ) :

జాతీయస్థాయి ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్) పరీక్ష ఫలితాలల్లో పట్టణంలోని చంద్రకాలనీ (అనపగుట్ట) మున్సిపల్ యూపీ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సత్తాచాటారు.ఇందులో ఉదయ్ కుమార్,మహతి,మోహిత్ నరసింహులు ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించారు.ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి మాట్లాడుతూ జాతీయస్థాయి ఉపకార వేతన పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం,అందులోను ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉదయ్ కుమార్ 3వ ర్యాంకు కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు.దీని వెనక విద్యార్థుల కఠోర శ్రమ,ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలచొప్పున స్కాలర్షిప్ లభిస్తాయన్నారు.భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.ఇందులో భాగంగా తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# గండి క్షేత్రంలో అన్న ప్రసాద కైంకర్యం

**శ్రావణమాసంలో ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ**


**భక్తులు భాగస్వాములు కావాలి: మల్లెల రామానుజులు**

కడప/గండి ఆగస్టు 13 (ప్రజా సీమ):



ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సప్తగిరి గోవింద మాల సేవా సమితి నిర్వాహకులు, మొల్ల ప్రభ మాసపత్రిక ఎడిటర్ మల్లెల రామానుజులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15, 22, 29 తేదీలతో పాటు సెప్టెంబర్ 5న కూడా గండి క్షేత్రంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ వీరాంజనేయ స్వామి కొలువైన ప్రసిద్ధ గండి క్షేత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం, అందులో భక్తులు భాగస్వాములు కావడం మహాభాగ్యమని రామానుజులు పేర్కొన్నారు.శ్రావణమాసంలో గండి క్షేత్రంలో అన్నదానం చేయడం వల్ల కోటి జన్మల పుణ్యం లభిస్తుందనే విశ్వాసం ఉందని రామానుజులు తెలిపారు. శ్రావణమాసంలోని నాలుగు శనివారాల్లో అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించే దాతలకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, శ్రీ వీరాంజనేయ స్వామివారి అనుగ్రహం లభిస్తాయని ఆయన ఆకాంక్షించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు 8309284907 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అన్నప్రసాద కైంకర్యంలో పాలుపంచుకునే దాతలకు స్వామివారి శేషవస్త్రం, స్వామివారి పటం, లడ్డూ ప్రసాదం అందజేస్తామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్నప్రసాద కైంకర్యంలో భాగస్వాములు కావాలని కోరారు.

# ప్రజల మనిషి నిరంతర ప్రజా సేవకుడు వైసీపీ సీనియర్ నాయకుడు వైస్ ఎంపీపీ రామిరెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు.








**ఘనంగా ఏర్పాట్లు చేస్తున్న అభిమానులు.**

రైల్వేకోడూరు, ప్రజాసీమ:

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన వైస్ ఎంపీపీ, వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి ద్వజా రెడ్డి జన్మదిన వేడుకలను ఆగస్టు 14న రైల్వేకోడూరులోని ఎస్‌-ఎల్‌ఆర్ కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వైసీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.నిరంతరం ప్రజా సేవకు అంకితమై పేదలు, అనారోగ్య బాధితులు, వృద్ధులు, మహిళలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును కొనసాగించలేకపోతున్న విద్యార్థులకు తనవంతు సహాయం అందిస్తూ 'నేనున్నాను' అంటూ అండగా నిలుస్తున్నారని ఆయన అభిమానులు తెలిపారు. తన సొంత నిధులతో అవసరమైన వారికి వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా [illegible] పేర్కొన్నారు.నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కుల, మత, ప్రాంత, వర్గ భేదాలు లేకుండా సహాయం కోరిన వారికి తనవంతు ఆపన్నహస్తం అందిస్తున్నారని అభిమానులు తెలిపారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అడిగిన వెంటనే ఆర్థిక సహాయం అందిస్తున్నారనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉందన్నారు.ప్రయాణికుల కోసం బస్టాండ్ నిర్మాణంఎన్నో సంవత్సరాలుగా తిరుపతి వైపు వెళ్లే ప్రయాణికులకు సరైన బస్సు షెల్టర్ లేక ఎండాకాలం, వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన ద్వజా రెడ్డి, రైల్వేకోడూరు పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలో తన సొంత నిధులతో కొన్ని లక్షల రూపాయలు వెచ్చించి బస్టాండ్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని అభిమానులు తెలిపారు. ప్రస్తుతం ఈ బస్టాండ్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతూ, ద్వజారెడ్డి ప్రజా సేవకు చిరస్థాయిగా నిలిచిందని వారు పేర్కొన్నారు. వేసవికాలంలో ప్రతినెల ఉచితంగా ప్రయాణికులకు ప్రజలకు చల్లని త్రాగు నీరు, మజ్జిగ పంపిణీ చేస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారని అభిమానులు అభిప్రాయ పడ్డారు .పదవితో సంబంధం లేకుండా ప్రజాసేవకు అంకితమైన రామిరెడ్డి ద్వజా రెడ్డి రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజల మనసులలో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అభిమానులు అభిప్రాయపడ్డారు.. ఈ మేరకు జన్మదిన వేడుకలకు ఏర్పాట్ల సందర్భంగా ద్వజా రెడ్డికి సంబంధించిన భారీ కటౌట్లు పట్టణంలోని పలు ప్రాంతాల్లో వెలిశాయి. భారీ కేక్ కటింగ్, సన్మాన కార్యక్రమాలతో పాటు విందు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయని అభిమానులు తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా అభిమానులు రామిరెడ్డి ద్వజా రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# గ్రూపు విద్యుత్ సర్వీసులకు ఒకే క్లిక్‌తో బిల్లుల చెల్లింపు

**వినియోగదారుల సౌకర్యార్థం కొత్త డిజిటల్ సదుపాయం**

**ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి**

కడప,ఆగస్టు 13 (ప్రజాసీమ):

గ్రూపు విద్యుత్ సర్వీసుల వినియోగదారుల సౌకర్యార్థం ఒకే క్లిక్‌తో పలు విద్యుత్ సర్వీసుల బిల్లులను ఒకేసారి చెల్లించే కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా ఒకే వినియోగదారుడి పేరుతో ఉన్న పలు విద్యుత్ సర్వీసులను ఒకే ఖాతాలో నమోదు చేసుకుని, అవసరమైన సర్వీసులను ఎంపిక చేసి వాటి బిల్లులను ఒకేసారి చెల్లించవచ్చని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల్లో తొలిసారిగా ఈ సదుపాయాన్ని ఏపీఎస్పీడీసీఎల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.టీటీడీ, మొబైల్ టవర్లు, పాల పరిశ్రమలు తదితర గ్రూపు సర్వీసుల వినియోగదారులకు ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని శివశంకర్ లోతేటి తెలిపారు. గతంలో ప్రతి సర్వీసు బిల్లును విడివిడిగా చెల్లించాల్సి ఉండగా, కొత్త విధానంతో సమయం ఆదా కావడంతో పాటు చెల్లింపు ప్రక్రియ సులభతరం, వేగవంతం అవుతుందని వివరించారు. వినియోగదారులకు మెరుగైన డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. వినియోగదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు.

# ఏ. విజయనగరం గ్రామంలో కలెక్టర్ గ్రీవెన్స్ -- రోడ్డు, తాగునీటి సమస్యలపై పరిశీలన

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )






గొల్లప్రోలు మండలంలోని ఏ. విజయనగరం గ్రామంలో గురువారం నిర్వహించిన "ఒక నెల -- నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.రైల్వే గేట్ మూసివేసిన సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏ. విజయనగరం నుంచి రావికంపాడు మీదుగా తొండంగి మండలానికి వెళ్లే రహదారి మార్గాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ వినతిపై అధికారులు ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టారు.అదేవిధంగా గ్రామంలో రోజువారీ తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు వివరించారు. దీనిపై అధికారులు వాటర్ ట్యాంక్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.తదుపరి అంగన్వాడీ కేంద్రం మరియు ఎంపీపీ పాఠశాలను సందర్శించిన అధికారులు అక్కడి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.



## హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించిన బి.టి కళాశాల విద్యార్థులు

### - పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ గిరిబాబు,అధ్యాపకులు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు ఈనెల 15న జరుపుకోనున్న భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాలలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు.ముందుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు పర్యవేక్షణలో విద్యార్థులు మరియు అధ్యాపకుల చేత హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు.తదుపరి కళాశాల విద్యార్థులు,ప్రిన్సిపల్ మరియు సిబ్బంది అందరూ జాతి సమైక్యతను,దేశభక్తిని చాటే నినాదాలు చేస్తూ భారతీయుల గర్వకారణమైన మువ్వన్నెల జెండాను ఎగరవేస్తూ మదనపల్లి పట్టణ వీధులలో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో కళాశాలకు చెందిన ఎన్సిసి విద్యార్థులు ప్రధాన ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ భారతీయుల స్వేచ్ఛకు,స్వాతంత్ర్యానికి మన మువ్వన్నెల జెండా చిహ్నమన్నారు.అలా మన జాతి సమైక్యతకు చిహ్నంగా నిలిచిన భారత మువ్వన్నెల జెండాను మన తెలుగువాడైన పింగళి వెంకయ్య రూపొందించడం మనందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.అలాంటి మన జాతీయ జెండాను ప్రతి ఇంటి పైన ఎగరవేసి తమ దేశభక్తిని చాటుకోవడం భారతీయ పౌరులుగా మన కర్తవ్యమని ఆయన సూచించారు.ర్యాలీలో పాల్గొన్న వారిలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ గన్నవరం శ్రీదేవి,డాక్టర్ శైలజ సి.ఎస్,డాక్టర్ జి.చిన్నారెడ్డి,ఎల్.బి ప్రదీప్,బాలాజీ,డాక్టర్ కృష్ణవేణి,డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి,డాక్టర్ ఎస్.గురుప్రసాద్ ఇతర ఔట్సోర్సింగ్ అధ్యాపకులు




## మిట్స్ వర్సిటీలో జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకలు

### - హాజరైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్,రిజిస్టార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ వారి ఆధ్వర్యంలో గురువారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్,రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మరియు అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పుస్తక పఠనంతో పాటు డిజిటల్ లైబ్రరీలు,ఈ–బుక్స్,ఆన్లైన్ జర్నల్స్,డిజిటల్ వనరులు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ పుస్తకాల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని,పుస్తకాలు మనిషికి శాశ్వత జ్ఞానాన్ని అందించే మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులపాటు ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ పుస్తక ప్రదర్శనలో ఇంజినీరింగ్,సైన్స్,టెక్నాలజీ,కంప్యూటర్ సైన్స్,మేనేజ్మెంట్,పరిశోధన తదితర విభాగాలకు సంబంధించిన జాతీయ మరియు అంతర్జాతీయ వైలీ,ఓ రైలీ,ఓరియంట్ బ్లాక్స్వాన్,సీబీఎస్,కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్,స్ప్రింగర్ వంటి అనేక రకాల పుస్తకాలను ప్రదర్శించారు.పుస్తక ప్రదర్శనలో డాక్టర్ ఎన్.గంగిశెట్టి,లైబ్రేరియన్ డాక్టర్ ఎమ్.సురేష్ బాబు,విభాగాధిపతులు,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






## హర్ ఘర్ తిరంగతో దేశ భక్తి పెంపొందించుకోవాలి

### - ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ

**వేంపల్లె ప్రజాసీమ:**

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని పెంపొందించు కోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ వెల్లడించారు. గురువారం కళాశాల నుంచి వేంపల్లె పూరవీధుల గుండా భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విధ్యార్థులు, అధ్యాపకులు జాతీయ పతాకాన్ని పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాజీయ బేగం, అధ్యాపకులు నాగేంద్ర, జనార్దన్, మసుద, శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# గాయపడిన టీడీపీ నేత సుబ్బారావును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వర్మ

**కాకినాడ జిల్లా ప్రజా సీమ**

గొల్లప్రోలు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావును పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీఎస్ఎన్ వర్మ పరామర్శించారు. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న సుబ్బారావును ఆయన నివాసంలో వర్మ శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు ధైర్యం చెప్పారు.కొద్దిరోజుల క్రితం గుండ్ర సుబ్బారావు తన వ్యవసాయ పొలంలో పనులను పర్యవేక్షించడానికి వెళ్లారు. అక్కడ నీటి మోటార్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ ఆయన చేతి వేళ్లు రన్నింగ్‌లో ఉన్న మోటార్ బెల్ట్‌లో ఇరుక్కుపోయాయి. ఈ ఊహించని ప్రమాదంలో సుబ్బారావు కుడిచేతి మూడు వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయన్ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు.

**పరామర్శించిన వర్మ.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

సుబ్బారావు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, శుక్రవారం గొల్లప్రోలులోని ఆయన నివాసానికి చేరుకున్నారు. సుబ్బారావును ఆప్యాయంగా పలకరించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి అప్రమత్తం చేశారు. సుబ్బారావు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వర్మ పేర్కొన్నారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



మాజీ ఎమ్మెల్యే వర్మ పరామర్శించిన సమయంలో ఆయన వెంట స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సుబ్బారావు అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పట్టణ అధ్యక్షుడిని పరామర్శించడానికి నియోజకవర్గ స్థాయి నేత రావడంతో స్థానిక కార్యకర్తల్లో ధైర్యం నిండింది. సుబ్బారావు ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగానే ఉందని, వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

# యూడైస్ం నమోదుపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

**కాకినాడ జిల్లా ప్రజా సీమ**

గొల్లప్రోలు: 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి యూడైస్ం (ఖణ×ూజుం) డేటా నమోదుపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కంప్యూటర్ ఆపరేటర్ ఆర్. రాజు ప్రధానోపాధ్యాయులకు యూడైస్ంలో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి--1 వెన్నా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా యూడైస్ంలో ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని సూచించారు. యూడైస్ంలో నమోదయ్యే సమాచారం ఆధారంగానే పాఠశాలల విద్యా మౌలిక అవసరాలను ప్రభుత్వం గుర్తించి, తగిన ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.



# తిరుపతి నుంచి ముగ్గురు క్రీడాకారులకు ఏపీ సిట్టింగ్ క్రికెట్ జట్టులో చోటుజాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం

**తిరుపతి ప్రజాసీమ న్యూస్:**

పారా సిట్టింగ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన ట్రై సిరీస్‌లో ప్రతిభ కనబరిచిన తిరుపతి జిల్లా సిట్టింగ్ క్రికెట్ జట్టుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ సిట్టింగ్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు.తిరుపతి జిల్లా జట్టుకు చెందిన బండపల్లి మహేష్, దేవల రామయ్య, ఎన్. నవీన్ కుమార్ తమ ప్రతిభతో రాష్ట్ర జట్టులో చోటు సంపాదించారు. త్వరలో చెన్నైలో జరగనున్న జాతీయ స్థాయి సిట్టింగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో వీరు ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.గతంలో తిరుపతి జిల్లా కలెక్టర్, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకుల సహకారంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లోనూ ఈ ముగ్గురు క్రీడాకారులు తిరుపతి జిల్లా తరపున పాల్గొన్నారు. లభించిన ప్రోత్సాహం, సహకారం తమ ప్రతిభను మెరుగు పరుచుకోవడానికి ఎంతగానో దోహదపడిందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు, ఏపీ సిట్టింగ్ క్రికెట్ జట్టు మేనేజ్‌మెంట్‌కు జిల్లా సిట్టింగ్ క్రికెట్ జట్టు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు జట్టు కెప్టెన్ మల్లు సుబ్బనరసారెడ్డి పేర్కొన్నారు.విభిన్న ప్రతిభావంతుల్లో క్రీడలపై మరింత ఆసక్తి పెంపొందించేలా ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తిరుపతి జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంపై క్రీడాభిమానులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో వారు విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.



# పాఠశాలల్లో విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సులుఈవ్‌టీజింగ్,మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన





**పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:**

తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ శ్రీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి మండలాల్లో పోలీసులు పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సందర్భంగా పోలీసులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలకు వెళ్లే సమయంలో లేదా తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఎక్కడైనా ఈవ్‌టీజింగ్, వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా బాల్య వివాహాలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.టీనేజ్ వయసులో ప్రేమ వ్యవహారాలు, తొందరపాటు నిర్ణయాలు మరియు ప్రేమ వివాహాల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించి, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే అవసరమైన సహాయాన్ని అందిస్తామని పోలీసులు తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ సందర్భంగా కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాల పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా ఉంచుతున్నామని తెలిపారు.

ప్రజాసీమ

# పేదల దాహార్తి తీర్చేందుకు బోరు ఏర్పాటు

- తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన అగాపే ఫౌండేషన్

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక రెడ్డయ్య కాలనీలో పేదలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు అగాపే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు చేశారు. గురువారం ఎస్ఎఎఫ్ ఇంటర్నేషనల్, కెనడా సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను టిడిపి మండల కన్వీనర్ సింగారెడ్డి రామముని రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, అగాపే ఫౌండేషన్ ప్రతినిధి జాన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఫౌండేషన్ నిర్వాహకులు బోరు ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బోరు అందుబాటులోకి రావడంతో కాలనీలోని పలు కుటుంబాలకు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. పేదల అవసరాలను గుర్తించి సహకరించిన అగాపే ఫౌండేషన్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ క్లస్టర్ ఇంచార్జి మహమ్మద్, రాయుడు పాల్గొన్నారు.



# వివిధ చట్టాలపై విధ్యార్థులకు అవగాహన

- వేంపల్లె సీఐ టి.నరసింహులు

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక స్వామి వివేకానంద పాఠశాల విధ్యార్థులకు వివిధ చట్టాలపై సిఐ టి.నరసింహులు అవగాహన కల్పించారు. గురువారం మహిళా బద్రత, శక్తి యాప్, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు అరికట్టడం, మాదక ద్రవ్యాల నిరోధకం, రోడ్డు బద్రత నియమాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చిన్నతనం నుంచే చెడు వ్యసనాలకు దూరంగా మెలగాలని వెల్లడించారు. ప్రజలు, మహిళల బద్రతకు నిరంతరం పోలీస్ వ్యవస్థ శ్రమిస్తోందన్నారు. ఆపద సమయంలో పోలీస్ రక్షణకు శక్తి యాప్ వినియోగంపై వివరించారు. అలాగే బాల్య వివాహాల వల్ల జరిగే అనార్థాలు, వీరి హక్కుల గురించి తెలిపారు. రోడ్డు బద్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్ నాయక్, కరస్పాండెంట్ వివేకానంద రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన సేవలకు ఎన్ జెన్ పోస్ట్‌ఆఫీస్

- ప్రాంతీయ తపాలా శాఖ అధికారి ఎం.సుధాకర్

వేంపల్లె ప్రజాసీమ:

వినియోగదారులకు ఆధునిక సాంకేతికతతో మెరుగైన సేవలు అందించేందుకు ఎన్ జెన్ పోస్ట్‌ఆఫీస్ లను ఏర్పాటు చేసినట్లు కర్నూలు ప్రాంతీయ తపాలా శాఖ అధికారి ఎం.సుధాకర్ వెల్లడించారు. గురువారం ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఎన్ జెన్ పోస్ట్‌ఆఫీస్ ని ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఎన్ జెన్ పోస్ట్‌ఆఫీస్ అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి పోస్టల్ సేవలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. భారత తపాలా శాఖ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్, పరిపాలన అధికారి డా.రవికుమార్, తపాలా శాఖ అధికారులు లక్ష్మన్న, నాగరాజు, అభిషేక్, శశిధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

- డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్

- ట్రిపుల్ ఐటీ ఆవరణాల్లో స్వచ్ఛాంద్ర.. స్వచ్ఛ భారత్

వేంపల్లె ప్రజాసీమ:

పరిసరాల పరిశుభ్రతే ప్రధాన ధ్యేయమని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ వెల్లడించారు. గురువారం ట్రిపుల్ ఐటీ ఆవరణాల్లో స్వచ్ఛాంద్ర.. స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యాలయ ప్రాంగణాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, అధికారులు కోటేశ్వరి, కోనప్ప, సత్యానంద రామ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.




# కంచర్ల మధు పార్థివ దేహానికి నిస్సార్ అహమ్మద్ నివాళి

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు పెద్ద కుమారుడు కంచర్ల మధుసూదన్ నాయుడు మంగళవారం రాత్రి కర్ణాటకలోని చింతామణి సమీపంలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.మదనపల్లె వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ గురువారం కంచర్ల శ్రీనివాసులు నాయుడు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతుడు కంచర్ల మధుసూదన్ నాయుడు పార్థివ దేహానికి నివాళులర్పించారు.శ్రీనివాసులు నాయుడు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ కంచర్ల మధుసూదన్ నాయుడు అకాల మరణం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.సమాజానికి మంచి చేయాలనే మంచి మనస్తత్వం కలిగిన కంచర్ల శ్రీనివాసులు నాయుడు,కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా వుండాలన్నారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నిస్సార్ అహమ్మద్ తోపాటు బయ్యారెడ్డి,మల్లికార్జున రెడ్డి,గ్రానైట్ మహేష్,ఫిరోజ్,శ్రీకాంత్ రెడ్డి,నాగార్జున,ఎన్.నవాజ్,జహీర్ తదితరులు కంచర్ల మధుకు నివాళులర్పించారు.



# చిన్నారి అనంత దక్షిత్ స్కేటింగ్‌లో లక్ష్యాన్ని అధిగమించాలి

- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఆకాంక్ష

మదనపల్లె (ప్రజా సీమ) :

కేవలం 3.3 సంవత్సరాల వయసులోనే స్కేటింగ్‌లో అద్భుత ప్రతిభను కనబరుస్తూ ప్రపంచ రికార్డు నెలకొల్పే లక్ష్యంతో ముందుకు సాగుతున్న చిన్నారి ఛాంపియన్ అనంత దక్షిత్ ప్రయత్నానికి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ప్రోత్సాహం అందించారు.నేడు అనగా ఆగస్ట్ 14వ తేదీ శుక్రవారం ఉదయం 5:30 గంటలకు అన్నమయ్య సర్కిల్,రింగ్ రోడ్,మదనపల్లె నందు అనంత దక్షిత్ మదనపల్లె నుండి కదిరి వరకు 79 కిలోమీటర్లు స్కేటింగ్ ప్రపంచ రికార్డు ప్రయత్నం జరగనుంది.ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ చిన్నారి ప్రతిభకు మనమంతా అండగా నిలుద్దామని,స్కేటింగ్‌లో ఈ చిన్నారి చరిత్ర సృష్టిస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




# కలకడలో రేపు హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ

కలకడ ప్రజాసీమ:



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కలకడలో రేపు సైకిల్ ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సిద్దేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ వద్ద నుంచి బస్టాండ్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని అధికారులు కోరారు. అలాగే ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు అందరి అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో భాను ప్రసాద్ అధికారులను కోరారు. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# టమోటా రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- సమగ్ర టమోటా ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు చేయాలి

- పీలేరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి సోమశేఖర్ రెడ్డి డిమాండ్

గుర్రంకొండ (ప్రజా సీమ) :

టమోటా ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని,టమోటా రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.గురువారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో టమోటా రైతుల సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులతో కలిసి ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు.పీలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వేలాది మంది రైతులు టమోటా సాగుపై ఆధారపడి ఉన్నారని,అధిక ఉత్పత్తి సమయంలో ధరలు తీవ్రంగా పడిపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడిని కూడా తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడుతోందని బాలిరెడ్డి అన్నారు.ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా పీలేరు నియోజకవర్గం కేంద్రంగా సమగ్ర టమోటా ప్రాసెసింగ్ పార్క్,కోల్డ్ స్టోరేజ్,కలెక్షన్,గ్రేడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే రైతుల ఎఫ్.పీ.ఓలను బలోపేతం చేసి ప్రాసెసింగ్ పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేయాలని కోరారు.టమోటా రైతుకు ప్రతి సంవత్సరం తాత్కాలిక ఉపశమనం కాదు – శాశ్వత పరిష్కారం కావాలి.టమోటాకు గిట్టుబాటు ధర,రైతుకు ఆదాయ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సమీరుద్దీన్,డీసీసీ మైనారిటీ ఉపాధ్యక్షులు హీదాయతుల్లా హుస్సేనీ,కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణా రెడ్డి,రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ యస్.కె.బాషా,డీసీసీ మైనారిటీ జాయింట్ సెక్రెటరీ గౌస్ బాషా,మండల మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాజా,అర్షద్,నూర్ ముహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.




# పంద్రాగస్ట్ వేడుకలకు ముస్తాబవుతున్న పోలీస్ పరేడ్ మైదానం

- పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ కునుబిల్లి ధీరజ్ కునుబిల్లి

మదనపల్లె (ప్రజా సీమ) :

ఆగష్ట్ 15న పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్స్‌ను గురువారం ప్రత్యేక వాహనంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు.పోలీసు,ఎక్సైజ్,హోంగార్డ్స్,ఎన్.సి.సి దళాలు మరియు స్కౌట్స్,గైడ్స్ కవాతును ఆయన పర్యవేక్షించారు.పరేడ్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని,వేడుకలకు వచ్చే ప్రజలకు తగిన సౌకర్యాలతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి,ఏఆర్ డీఎస్పీ డి.ఏడుకొండలరెడ్డి,ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

## రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి

## కలెక్టర్ భవేష్ మిశ్రా

## డంపింగ్ యార్డు సందర్శన

పజాసీమ

ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా, నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి గారిచే జారీ చేయనైనది




## అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా శ్రియా శరణ్ అనుభవాలు



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బ స్టర్‌గా నిలిచిన సంగతి తెలి సిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలి చింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్ని శ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ. ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందు కంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీ కాంత్ సర్‌ని కల వండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నా ను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహ మాన్ సర్ ఉన్నారు, అలాగే సిని మా టోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీ కాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో [illegible] గుర్తుచేసుకున్నారు.

## లోకేశ్ కనగరాజ్ చిత్రం డిసికి పెరుగుతున్న కలెక్షన్లు



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## రజనీకాంత్ ధర్మన్ మూవీ సెకండ్ షెడ్యూల్ ప్రారంభం

సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివరకే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.



SUPERSTAR RAJINIKANTH'S IMMEDIATE AFTER JAILER 2 IS WITH DIRECTOR SUNDAR.C PRODUCED BY KAMAL HAASAN UNDER RAJ KAMAL INTERNATIONAL BANNER.



# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం



అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma